క్లుప్తంగా

హైకోర్టు ఉత్తర్వుల ప్రతిని తహసీల్దార్‌కు అందజేత



తహసీల్దార్‌కు హైకోర్టు ఉత్తర్వుల ప్రతిని అందజేస్తున్న సాలార్‌పూర్ గ్రామస్తులు

కడ్తాల్: సాలార్‌పూర్ గ్రామానికి చెందిన రైతుల భూములు పట్టా భూములని, ఈ నెల 12వ తేదీన హైకోర్టు ఉత్తర్వులు జారి చేసిందని, సాలార్‌పూర్ గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వుల ప్రతిని తహసీల్దార్ షేక్ ముంతాజ్‌కు వారు అందజేశారు. దీనికి తహసీల్దార్ కూడా సానుకూలంగా స్పందించారన్నారు. రిజిస్ట్రేషన్‌లను ప్రారంభిస్తామని, అదే విధంగా గతంలో నిలిచిపోయిన రిజిస్ట్రేషన్‌లను కూడా పునః ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని గ్రామస్తులు తెలిపారు. దీంతో సాలార్‌పూర్ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ, స్వీట్లు పంచిపెట్టి సంబురాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో శంకర్, పంతునాయక్, రమేశ్ తదితరులు ఉన్నారు.

ముందస్తు అరెస్టులు బాధాకరం



సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలను అరెస్టు చేసిన పోలీసులు

యాచారం: కలెక్టరేట్ ముట్టడి పిలుపు నేపథ్యంలో శుక్రవారం యాచారం పోలీసులు సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం బాధాకరమన్నారు. అరెస్టులతో ప్రజా ఉద్యమాన్ని ఆపలేరని, రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజావ్యతిరేక విధానాలను నిలిపేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

సురభి వాణిదేవికి సన్మానం



వాణిదేవికి బొకే ఇస్తున్న శ్రీనివాస్

తలకొండపల్లి: శాసన మండలి సభ్యురాలు సురభి వాణిదేవిని సన్మానించారు. శుక్రవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ హైదరాబాద్‌లో వాణిదేవిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువా కప్పి, పుష్ప గుచ్ఛం ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో శరత్ శ్చంద్రశర్మ, లింగంగౌడ్, వెంకటయ్య, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఆమనగల్లు: ఆమనగల్లు మండలంలో శనివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పర్యటించనున్నారని ఎంపీడీవో కుసుమ మాధురి ఒక ప్రకటనలో తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో జరిగే వన మహోత్సవం ర్యాలీ, మేడిగడ్డ తండాలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొంటారని ఆమె తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ మోడల్ స్కూల్ జూనియర్‌కళాశాలలో బోధించడానికి హావర్లీ బేసడ్ ఉపాధ్యాయుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లావణ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు గణితం బోధించడానికి ఎంఎస్సీ గణితంలో బీఈడీ చేసిన వారు, తొమ్మిదోతరగతి నుంచి ఇంటర్ వరకు సోషల్ స్టడీస్, పొలిటికల్ సైన్స్ బోధించడానికి ఎంఏ పొలిటికల్ సైన్స్‌లో బీఈడీ చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జీతం నెలకు రూ.18,200 (గంటలకు 182) చొప్పున చెల్లిస్తామని తెలిపారు. ఈ నెల 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

సీతాఫలాల సేకరణకు వేలం

కడ్తాల్: ఆమనగల్లు ఫారెస్ట్ డివిజన్ పరిధిలోని కందుకూర్ రేంజ్ ఫారెస్ట్ ఏరియాలో సీతాఫలాల సేకరణకు టెండర్ నిర్వహిస్తున్నట్లు, ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలని సెక్షన్ అధికారి హుస్సేన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేదీన అటవీ శాఖ ఆధ్వర్యంలో గుర్రంగూడలో ఉదయం 11 గంటలకు టెండర్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు టెండర్‌లో పాల్గొనాలని కోరారు.

పరిసరాలపై అవగాహన

షాద్‌నగర్: ప్రజలందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకన్న సూచించారు. శుక్రవారం షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై కాలనీ వాసులకు అవగాహన కల్పించారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

- మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, కమిషనర్ అమరేందర్‌రెడ్డి
- బొంగ్లూర్‌లో స్వచ్ఛత కార్యక్రమం
- ఫ్రైడే డ్రైడేలో అధికారులు, కార్పొరేటర్లు



తుర్కయంజాల్: రసాయనాలు స్ప్రేచేయిస్తున్న కమిషనర్ అమరేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రతిఒక్కరూ తప్పనిసరిగా పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగ్లూర్ గంగానగర్ కాలనీలో ఫ్రైడే డ్రైడే నిర్వహించి చెత్తచెదారం తొలగించారు. నేరుగా చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి పారపట్టి పనులు చేశారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ వర్షకాలంలో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయొదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, కౌన్సిలర్ కుంట్ల మౌనిక ఉదయ్‌పాల్‌రెడ్డి, ఏఈ వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: పరిసరాల పరిశుభ్రత ప్రజలందరి బాధ్యత అని ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ వసంత అన్నారు. పట్టణంలోని వివిధ కాలనీల్లో మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్‌తో కలిసి కమిషనర్ వసంత పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటిముందు నీటితొట్లలో నిలువ ఉన్న నీటిని తొలగించారు. వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్‌లు యాదమ్మ, చెన్నకేశవులు, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

హయత్‌నగర్‌లో..

హయత్‌నగర్: వర్షాలు కురుస్తున్నందునా సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదాలు ఉన్నాయని, దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తుర్కయాంజాల్ మున్సిపాలిటీ 15వ వార్డు కౌన్సిలర్ వేముల స్వాతి అమరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె మునగనూరులో పలు కాలనీలలో ఫ్రైడే–డ్రైడే నిర్వహించారు. రోడ్లపై, బహిరంగ ప్రదేశాలలో నిలిచి ఉన్న వర్షం నీటిని మున్సిపాలిటీ సిబ్బందితో తొలగింపజేశారు.

తుర్కయంజాల్..

తుర్కయంజాల్: ప్రజలంతా డ్రైడేలో భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ కె అమరేందర్ రెడ్డి కోరారు. శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని పురస్కరించుకుని మున్సిపాలిటీలోని 24 వార్డుల్లో కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బందిని భాగస్వాములను చేసి అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో విష జ్వరాలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా దోమల వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దోమల నివారణకు టెమిపాస్ రసాయన స్ప్రే, ఆయిల్ బాల్‌లను మురుగు నీటి కాలువల్లో వదిలారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, ఈఈ హరీష్ తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: నీటిని తొలగిస్తున్న వసంత



హయత్‌నగర్: మ్యాన్‌హోళ్లను శుభ్రం చేయిస్తున్న కౌన్సిలర్ స్వాతి

వీరన్న చెరువు పరిశీలన



శెట్టిపల్లిలో వీరన్న చెరువును పరిశీలిస్తున్న అధికారులు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామంలోని వీరన్న చెరువును శుక్రవారం నీటిపారుదల శాఖ డీఈఈ నరేందర్ రెడ్డి, ఏఈ తిరుపతిరెడ్డిలు పరిశీలించారు. శెట్టిపల్లిలోని వీరన్న చెరువుకు మరమ్మతులు చేయాలని, చెక్‌డ్యాం నిర్మించాలని కోరుతూ ఇటీవల కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి సత్యం వినతిపత్రం అందించారు. వీరన్న చెరువు మరమ్మతులు చేయాలని కోరిన వెంటనే అధికారులను పంపి ప్రతిపాదనలు చేయించినందుకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ఎగిరిశెట్టి సత్యం కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు అందుబాటులో ఎరువులు



రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న అరుణకుమారి

ఆమనగల్లు: మండలంలో రైతులకు సరిపడా ఎరువులు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి అరుణకుమారి చెప్పారు. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలతో రైతులు పంటలు సాగుచేసుకోవాలని ఆమె సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని వాసుదేవ ట్రేడర్స్, సూర్య అగ్రిషాప్, రైతు ఆగ్రోసేవా కేంద్రం, రామాంజనేయట్రేడర్స్, రైతుమిత్ర ఆగ్రో ఏజెన్సీస్ షాపులను ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. ఆయా షాపులలో ఉన్న ఎరువుల నిల్వలను, స్టాకు రిజిస్టర్‌లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ వానాకాలం పంటల సాగుకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. డీలర్లు మంచుకొండ శేఖర్, సురేశ్ పాల్గొన్నారు.

డ్రగ్స్ నివారణకు కృషి అభినందనీయం

జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి పురుషోత్తం



ఏసీపీ రాజును సన్మానిస్తున్న జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి పురుషోత్తం

ఇబ్రహీంపట్నం రూరల్: డ్రగ్స్ నివారణకు పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమని జన విజ్ఞాన వేదిక రంగారెడ్డి జిల్లా కార్యదర్శి నూతనగంటి పురుషోత్తం పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజును కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం ప్రాంతంలో ఇంజనీరింగ్ కళాశాలలు ఉండటంతో విద్యార్థులు డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వాటిని కట్టడి చేయడానికి ఏసీపీ చేస్తున్న కృషిని అభినందించారు.

మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు



అమ్మవారి పూజలో పాల్గొన్న కిషన్‌రెడ్డి సతీమణి ముకుందమ్మ కుటుంబసభ్యులు

ఇబ్రహీంపట్నం: బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సతీమణి ముకుందమ్మ కుటుంబసభ్యులతో కలిసి ఇబ్రహీంపట్నంలోని మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం జరిగే మహంకాళి బోనాల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ముకుందమ్మతోపాటు ఆమె కోడలు మౌనిక, కూతురు శీతలమ్మలు దర్శించుకున్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్



మొక్కలు పంపిణీ చేస్తున్న చైర్మన్ రాంపాల్‌నాయక్

ఆమనగల్లు: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ కోరారు. పట్టణంలోని 11వ వార్డులో శుక్రవారం వన మహోత్సవంలో భాగంగా ఇంటింటికి మొక్కల పంపిణీని చైర్మన్ రాంపాల్‌నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంపాల్‌నాయక్ మాట్లాడుతూ మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవంలో ప్రతీఒక్కరు భాగస్వాములై మొక్కలను నాటాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య, కమిషనర్ వసంత, కౌన్సిలర్‌లు బైకని యాదమ్మ, చెన్నకేశవులు, తదితరులు పాల్గొన్నారు

నేడు ఎంపీ, ఎమ్మెల్యేలు రాక

తలకొండపల్లి: మండల పరిధిలోని పడకల్ గ్రామానికి శనివారం నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి బాలాజీసింగ్‌లు రానున్నారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30గంటల ప్రాంతంలో నిర్వహించనున్న రైతు రుణమాఫీ సంబురాల్లో వారు పాల్గొంటున్నట్లు ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.

లంచాలిస్తేనే తహసీల్ ఆఫీసులో పనులు

కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

యాచారం: లంచాలిస్తేనే యాచారం తహసీల్దార్ కార్యాలయంలో ఫైల్లు కదులుతున్నాయని కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు ముత్యాల వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ధరణి పోర్టల్ సమస్యతో అన్ని గ్రామాల్లో భూ సమస్యలున్నాయని అన్నారు. సర్కార్ భూ సమస్యలపై ఎంతో చిత్తశుద్ధితో ఉన్నప్పటికి యాచారం తహసీల్దార్ కార్యాలయంలోని రెవెన్యూ సిబ్బంది మాత్రం లంచాలిచ్చిన వాటికే పనులు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. లంచాలు తీసుకుంటున్న రెవెన్యూ సిబ్బందిపై శనివారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి, ధరణి కమిటీ సభ్యుడు ముదిరెడ్డి కోదండరెడ్డికి ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

కొనసాగుతున్న దీక్షలు



తలకొండపల్లి: నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు



మంచాల: మాట్లాడుతున్న స్వప్న తదితరులు

తలకొండపల్లి: మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి ఐదో రోజుకు చేరుకున్నాయి. మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం వద్ద బైఠాయించి తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రమాదేవి, అంజమ్మ, జంగమ్మ, సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

మధ్యహ్న భోజనం ప్రైవేట్ సంస్థలకు అప్పగించొద్దు

మంచాల: మధ్యహ్న భోజనం వంట పనిని ప్రైవేట్ సంస్థలకు అప్పగించొద్దని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు యెలమోని స్వప్న డిమాండ్ చేశారు. మంచాల మండల కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మధ్యహ్న భోజన కార్మికులకు మద్దతుగా ఆమె సంఘీ భావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ పోచమోని కృష్ణ, ఆలివేలు, జంగమ్మ, లక్ష్మమ్మ, పద్మ, యాదయ్య, సరిత, భారతమ్మ, మస్రు తదితరులు పాల్గొన్నారు.

పౌరాణిక నాటక కళాకారుడు మృతి



నివాళులర్పిస్తున్న నాయకులు

మంచాల: పౌరాణిక నాటక కళాకారుడు కాచం రోజానందం (76) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. జాపాల గ్రామానికి చెందిన కాచం రోజా నందం ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతంలో పౌరాణిక నాటకాలలో శ్రీకృష్ణుడి పాత్ర వేసే వాడు. మధురమైన తన కంఠంతో శ్రీకృష్ణుడి వేశాధారణలో ఆకట్టుకునే వారు. అనేక సార్లు నాటకాల పోటీల్లో బహుతులు అందుకున్నారు. ఆయన మృతి తీరని లోటన్నారు. పలువురు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకుడు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు కుకుడాల రాంరెడ్డి, తెలంగాణ యూనివర్సిటిల (టీఎస్‌జీఓ) అధ్యక్షుడు బియ్యని జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

నేటి నుంచి సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమి



ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సమీపంలోని సత్యనారాయణ గుట్టపై గల సాయిబాబా ఏకశిలా మందిరంలో గురు పౌర్ణమి వేడుకలను మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు శ్రీరమ్య, వేణుగోపాల్‌రావు తెలిపారు. శనివారం ఉదయం 6 గంటలకు హారతి, సాయిబాబా వ్రతాలు, అర్చనలు, అభిషేకాలు, ధ్వజారోహణ, ఆదివారం గురు పౌర్ణమి సందర్భంగా ఉదయం 6 గంటలకు హారతి, నిజాభిషేకం, 108 కళశాలచే అభిషేకం, కనకభిషేకం, సహస్ర పుష్పాభిషేకం, మధ్యాహ్న హారతి, అన్నదానం, సాయంత్రం సర్వదర్శనములు, భజనలు, సోమవారం ఉదయం సంప్రోక్షణ హారతి, నిజాభిషేకం, అర్చనలు, సాయంత్రం భజన కార్యక్రమాలు, అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు .

మాఫీపై రేవంత్‌రెడ్డి సర్కార్ మోసం



మాట్లాడుతున్న మర్పల్లి అంజయ్య యాదవ్

యాచారం: రుణమాఫీ అమలుపై రేవంత్‌రెడ్డి సర్కార్ మోసం చేస్తుందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ. 2 లక్షల్లోపు రుణాలున్న రైతులందరికి కటాఫ్ తేదీ లేకుండా మాఫీ చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ...సీఎంగా ఎన్నికైన తర్వాత రేవంత్‌రెడ్డి రైతుల పట్ల మాటమారుస్తున్నాడని అన్నారు. ఎన్నికల ప్రచారంలో మాట ఇచ్చిన ప్రకారం రూ. 2 లక్షల్లోపు రుణాలున్న రైతులందరికి మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ విషయంలో గతంలో కేసీఆర్ సర్కార్ చేసిన మోసాన్నే ప్రస్తుత రేవంత్‌రెడ్డి సర్కార్ చేస్తుందని ఆయన మండిపడ్డారు. మాఫీ వస్తుందనే ఆశతో గత పదేళ్లుగా చాల మంది రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాలను చెల్లించలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి జంగయ్యగౌడ్, గోగికార్ రమేష్, గొల్లపల్లి శ్రీధర్‌గౌడ్, వన్నెవాడ రవీందర్ రెడ్డి, నారిమల్ల రమేష్, పత్తి రాజు, నడికుడి కృష్ణ, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీపై హర్షం

- సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యేల చిత్రపటాలకు క్షీరాభిషేకం
- స్వీట్లు పంపిణీ చేసుకున్న రైతులు, నాయకులు



ఇబ్రహీంపట్నం రూరల్: తులేకలాన్‌లో..



ఆమనగల్లు: మేడిగడ్డ తండాలో క్షీరాభిషేకం

ఇబ్రహీంపట్నం రూరల్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయ సాధకుడే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరి రమేష్ పేర్కొన్నారు. రైతులకు రుణమాఫీ ప్రకటించడంతో గ్రామాల్లో హర్షం వ్యక్తం చేస్తూ ఇబ్రహీంపట్నం మండలంలోని తులేకలాన్, కప్పపహాడ్ గ్రామాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఏక కాలంలో రైతులకు రుణమాఫీ చేసిన ఘనత రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. సత్తు శశాంక్‌రెడ్డి, కోడూరి పాండు, కలకొండ కృష్ణ, దాసు, జంగయ్య, నర్సింహ, పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: మేడిగడ్డతండా సమీపంలోని వ్యవసాయ పొలంలో రైతు రుణమాఫీ చేసిన సందర్భంగా శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చిత్రపటాలకు కెఎస్‌ఆర్ యువసేన జిల్లా నాయకుడు విజయ్‌రాథోడ్ క్షీరాభిషేకం నిర్వహించారు. రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలుపుకుందని విజయ్‌రాథోడ్ పేర్కొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే రైతుల సంక్షేమం..

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే రైతుల సంక్షేమం జరుగుతుందని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎంఎ ఖలీల్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలో ఖలీల్ విలేకరులతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు రూ.2లక్షల రుణమాఫి చేసి రైతుబాంధవుడు అయ్యాడని ఆయన అన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: ఎన్నికల హామీలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ మండల పరిధిలోని గానుగుమార్లతండా పంచాయతీతో పాటు, ముద్విన్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు, రైతులతో కలిసి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు లక్పతినాయక్ మాట్లాడారు. ముద్విన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మధు, బీక్యానాయక్, మోత్యానాయక్, చంద్రు, గోప్యా, తదితరులు పాల్గొన్నారు.

మాడ్గులలో..

మాడ్గుల: రైతు సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి నిరంతరం పని చేస్తున్నారని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కోల్కులపల్లి గ్రామంలో రైతు వేదిక వద్ద రైతులకు రుణమాఫీ చేసినందుకు సీఎం రేవంత్ చిత్రపటానికి రైతులతో కలిసి పాలభిషేకం నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, మండల అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి, పాండు గౌడ్, కృష్ణయ్య పాల్గొన్నారు.



కడ్తాల్: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



మాడ్గుల: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి



ఇబ్రహీంపట్నం రూరల్: కప్పపహాడ్‌లో క్షీరాభిషేకం